క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి



గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

సారవకోట: గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. మండలంలోని బొంతు పంచాయతీ సవరబొంతు గ్రామంలో దర్తీ ఆభ జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా సవరబొంతు, మర్రిపాడు గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఈ గ్రామాల్లో గిరిజనులకు కావాల్సిన మౌలిక వసతులు, కుల ధ్రువీకరణ పత్రాలు, రుణాల మంజూరు, తదితర విషయాలపై చర్చించారు. ఈ గ్రామాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తహసీల్దార్ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ ప్రభాకర్, సర్పంచ్ జన్ని సంధ్య పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఏడీ వెంకటమధు

నరసన్నపేట: స్థానిక వ్యవసాయశాఖ ఏడీగా లింగాల వెంకటమధు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పలాస ఏడీగా పనిచేస్తూ బదిలీపై నరసన్నపేటకు వచ్చారు. నరసన్నపేట ఏడీగా పనిచేసిన కె.రవీంద్రభారతి శ్రీకాకుళం జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయానికి డీపీఓగా బదిలీపై వెళ్లారు.

ఎంపీహెచ్‌ఈఓగా నర్సింగరావు



హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేట పీహెచ్‌సీకి ఎంపీహెచ్‌ఈఓగా బమ్మిడి నర్సింగరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరు సీతారామరాజు జిల్లా అనంతగిరి పీహెచ్‌సీలో పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఆయనకు స్థానిక సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోండి



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

నరుబుజ్జిలి: మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక సచివాలయంలో నిర్వహిస్తున్న మహిళల కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. శిక్షణలో సమయపాలన మార్పు చేయాలని మంత్రిని మహిళలు కోరారు. కమిషనర్‌తో మాట్లాడి సమయ పాలనలో మార్పులు తీసుకువస్తామని మంత్రి హామీ ఇచ్చారు. డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, దవళ సింహాచలం, బస్వా ఉమ, చిన్నబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



మర్రిగూడ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

హిరమండలం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ వైద్య, ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఫరుక్ హుస్సేన్ తెలిపారు. మర్రిగూడ గిరిజన ఆశ్రమ పాఠశాల, హిరమండలం కేజీబీవీ విద్యాలయాల్లో పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది శుక్రవారం శిబిరాలు నిర్వహించారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి తెలిపారు. విద్యార్థులకు రక్త పరీక్షలు చేపట్టారు. వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మినీ రిజర్వాయర్ పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఈఈ సీతారామనాయుడు

నరుబుజ్జిలి: కొత్తకోట మినీ రిజర్వాయర్‌ను వంశధార ఈఈ సీతారామనాయుడు శుక్రవారం పరిశీలించారు. రిజర్వాయర్‌లో జరుగుతున్న పనులు, కుడి కాలువలో చేపడుతున్న పూడికతీత పనులను తనిఖీ చేశారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడొద్దని సూచించారు. డీఈ శ్రీనివాసరావు, జేఈలు జగదీష్, ఖాజా, వెంకటరమణ, స్థానిక సర్పంచ్ సురవరపు జగదీశ్వరరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పేడాడ వెంకటరమణ పాల్గొన్నారు.

లక్ష్యం చేరాల్సిందే..!



పెద్దపేట డిపోలో రేషన్ బియ్యం పంపిణీ (ఫైల్)

- రేషన్ డీలర్లపై అధికారుల ఒత్తిడి
- జూన్‌లో తగ్గిన సరుకుల పంపిణీ శాతం
- జులైలో రేషన్ పంపిణీ శత శాతం పూర్తి చేయాలని ఆదేశం
- వృద్ధులు, దివ్యాంగులకు జులై రేషన్ పంపిణీ ప్రారంభం

నరసన్నపేట: రేషన్ సరుకులను ప్రతి కార్డుదారునికీ అందించేందుకు గత ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే వాలంటీర్ల వ్యవస్థ తీసుకొచ్చి వీరి ద్వారా రేషన్ సరుకులు ఇంటింటికీ అందచేశారు. కొద్దిరోజుల తరువాత ప్రత్యేక వాహనాలు పెట్టి కచ్చితమైన తూకంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేపట్టారు. కార్డుదారులందరికీ దాదాపుగా సరుకులు చేరేవి. ఒక్కో నెలలో 98 శాతం, 99 శాతం కూడా సరుకులు అందేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం అమలు చేసిన విధానాన్ని రద్దు చేసింది. పాత పద్ధతిలో రేషన్ డీలర్ల ద్వారా బియ్యం పంపిణీని జూన్‌లో ప్రారంభించింది. 15 రోజుల్లోగా డీలర్లు వద్దకు వెళ్లి బియ్యం తీసుకోవాలని సూచించింది. ఒక్కసారిగా బియ్యం విడిపించే వారి సంఖ్య పడిపోయింది. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పరిస్థితి మరింత తగ్గింది. ఉచిత బియ్యం చాలా మంది విడిపించుకోలేక పోయారు. ప్రతీ గ్రామంలో డీలర్లు లేకపోవడం, బియ్యం విడిపించేందుకు దూరం వెళ్లాల్సి ఉండటంతో చాలా మంది కార్డుదారులు జూన్‌లో బియ్యం విడిపించలేదు.

నరసన్నపేట నియోజకవర్గంలో మండలాల వారీగా బియ్యం పంపిణీ శాతం ఇలా..

మండలం	రేషన్ కార్డులు	బియ్యం తీసుకున్నవారు	శాతం
నరసన్నపేట	23134	21460	92.76
పోలాకి	20886	19066	91.26
సారవకోట	16166	14220	87.96
జలుమూరు	18817	16704	87.77

బియ్యం పంపిణీ శాతం పెరగాలి

మండలంలో రేషన్ డిపో డీలర్లు వీలున్నంత వరకు కార్డుదారులకు ఇబ్బంది లేకుండా బియ్యం పంపిణీ చేయాలి. 97 శాతం దాటాలి. దీనిని దృష్టిలో పెట్టుకొని డీలర్లు తగిన చర్యలు తీసుకోవాలి. జులై కోటా ప్రభుత్వ ఆదేశాల మేరకు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటింటికీ వెళ్లి బియ్యం అందజేస్తున్నాం.

– రామకృష్ణ, డీటీ, నరసన్నపేట

తగ్గిన సంఖ్య..

సారవకోట, జలుమూరు మండలాల్లో బియ్యం విడిపించే కార్డుదారుల సంఖ్య బాగా తగ్గింది. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఆందోళనకు గురయ్యారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల నుంచి మరింతగా వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉండటంతో జులైలో బియ్యం విడిపించే కార్డుదారుల సంఖ్యను పెంచేందుకు పౌరసరఫరాల శాఖ చర్యలు చేపట్టింది. వికలాంగులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు మూడు రోజులు ముందుగానే అందించేందుకు ఏర్పాట్లు చేసింది. డీలర్లపై అధికారులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 95 శాతం పంపిణీ దాటాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్యలు ఎంత వరకు ఫలితాలు ఇస్తాయో జులై 16వ తేదీ తరువాత తెలుస్తోంది. ఈ నెల 26వ తేదీ నుంచి డీలర్లు బియ్యం పంపిణీని ప్రారంభించారు.

మా గ్రామంలోనే బియ్యం పంపిణీ చేయాలి



మాది కొల్లవానిపేట గ్రామం. పంచాయతీ కేంద్రం కామేశ్వరిపేటలో రేషన్ డిపో ఉంది. బియ్యం తీసుకోవాలంటే రెండు కిలో మీటర్లు వెళ్లాలి. ప్రభుత్వం పెట్టిన కొత్త విధానంతో డిపో వద్దకు వెళ్లి బియ్యం తీసుకోవాలంటే కష్టంగా ఉంది. మా గ్రామంలోనే డీలరు ద్వారా బియ్యం పంపిణీ చేయాలి.

– నారాన నూకరాజు, కొల్లవానిపేట, నరసన్నపేట మండలం

డిపోలు అందుబాటులో ఉండాలి



గత ప్రభుత్వం ఇంటింటికీ వెళ్లి బియ్యం పంపిణీ చేసింది. ఈ పద్ధతి కార్డుదారులకు చాలా అనుకూలంగా ఉండేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పంపిణీ విధానాన్ని మార్చింది. అనేక మంది కార్డుదారులకు డిపోలు అందుబాటులో లేవు. ప్రతి గ్రామంనూ డిపోలు ఏర్పాటు చేయాలి.

– అవ్వ రవీంద్ర, సర్పంచ్ గొట్టిపల్లి, నరసన్నపేట మండలం

జయహో జగన్నాథ్..

- నేత్రపర్వంగా స్వామివారి రథయాత్ర
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



నరసన్నపేట: సత్యవరాగ్రహారం నుంచి కదిలిన జగన్నాథ స్వామి రథం



పాతపట్నం: జగన్నాథస్వామిని ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

జగన్నాథస్వామి రథయాత్రను శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. నరసన్నపేట, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో గల జగన్నాథ ఆయలయాల్లో ప్రత్యేక, విశేష పూజలు చేపట్టారు. అనంతరం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి మూల విరాట్‌లను రథంపై ఉంచి గుండిచా మందిరాలకు తరలించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాలను లాగారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



జలుమూరు: బైరాగిపేటలో రథాన్ని లాగుతున్న భక్తులు



హిరమండలం: ఎల్.ఎన్.పేటలో రథంపై ఊరేగుతున్న జగన్నాథస్వామి



జలుమూరు: శ్రీముఖలింగంలో రథోత్సవం



హిరమండలం: రథంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

నేడు వాహనాల వేలం

పాతపట్నం: ఈ నెల 28వ తేదీన స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో వాహనాల వేలం నిర్వహించనున్నట్లు సీఐ కె.కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు వివిధ కేసుల్లో ఉన్న వాహనాలను మాత్రమే వేలం వేయనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ జిరాక్స్, రూ.500 చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ కార్యాలయానికి వచ్చి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు.

నేడు ప్రజాదర్బార్

హిరమండలం: ఈ నెల 28వ తేదీన ఎల్.ఎన్.పేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొంటారని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కేంద్ర మంత్రి, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రజాదర్బార్‌కు విచ్చేస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారం హాజరుకావాలన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనలు తప్పనిసరి

హిరమండలం: ప్రైవేట్ పాఠశాలల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎంఈఓ రాంబాబు ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు సంబంధించి ఫీజు వివరాలను తప్పకుండా నోటీసు బోర్డులో పెట్టాలన్నారు. ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారినే నియమించాలన్నారు. జూలై 5న తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బంకించంద్ర ఛటర్జీకి ఘన నివాళి



ఛటర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాతపట్నం: జాతీయ గీతం వందేమాతరాన్ని రచించిన బంకించంద్ర ఛటర్జీ జయంతిని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఛటర్జీ చిత్రపటానికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఛటర్జీ రచించిన వందేమాతరం గీతం జాతీయ స్థాయిలో మంచిపేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టిందని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చిందన్నారు. నేటికీ ఈ గీతం మన ప్రార్థనలో భాగమై, మనలో దేశభక్తిని నింపుతుందన్నారు. సైన్స్ ఉపాధ్యాయుడు ఎస్.తారకరామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలకు ప్రశంస



కొత్తూరు: ట్రస్టు సభ్యులు, పాగిరి రవికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జగన్మోహనరావు



ఆమదాలవలస: అవార్డు అందుకుంటున్న వెంకటేష్

ఆమదాలవలస: పట్టణంలోని పూజారిపేటలో ఉన్న కృత్విక్ ఫౌండేషన్‌కు రెడ్ క్రాస్ అవార్డు దక్కింది. పూజారిపేటకు చెందిన చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) స్వచ్ఛంద సంస్థ స్థాపించి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిని గుర్తించిన రెడ్ క్రాస్ సంస్థ వెంకటేష్‌కు ప్రశంసాపత్రం, అవార్డుతో సత్కరించింది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

కొత్తూరు: మండల కేంద్రానికి చెందిన భగత్‌సింగ్ ట్రస్టు సభ్యులు, రెడ్ క్రాస్ మండల కన్వీనర్ పాగిరి రవి ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించారు. శ్రీకాకుళంలో ఇండియన్ రెడ్ క్రాస్ వార్షిక సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. భగత్‌సింగ్ ట్రస్టు సభ్యులు, పాగిరి రవికి ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు ప్రశంసాపత్రాలను అందజేశారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

నరసన్నపేట: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. నరసన్నపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద శుక్రవారం మొక్కలు నాటారు. అనంతరం స్థానిక మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, డీఎఫ్ఓ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి మాజీ ముఖ్యమంత్రి అన్న విషయాన్ని మరిచిపోయి కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భద్రత కల్పించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత బాధ్యతారహిత్యమైన ప్రకటనలు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు.

సూపర్ సిక్స్ పథకాల పేరిట ప్రజలకు మభ్యపెట్టిన కూటమి సర్కారు.. ఏడాది కాలంలోనే ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటోందన్నారు. ఏడాది కాలంలోనే ఇంతటి వైఫల్యం చెందిన ప్రభుత్వాన్ని ఇదివరకు ఎన్నడూ చూడలేదన్నారు. అరాచక పాలన సాగిస్తున్న చంద్రబాబు సర్కారుకు ప్రజలు సాగనంపే రోజు దగ్గర్లోనే ఉందన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- చింతాడ రవికుమార్



ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం ప్రకటించిన వివిధ విభాగాల నియోజకవర్గ స్థాయి అధ్యక్షులకు అభినందనలు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అందరం ఒకే తాటిపై నడిచి పార్టీ బలోపేతానికి కృషి చేద్దామన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన పదవులను ప్రతి ఒక్కరూ వారి స్థాయిలో పూర్తి బాధ్యతలతో నిర్వహించాలని కోరారు.

రోడ్డు ఇలా.. నడిచేది ఎలా?



సారవకోట మండలంలోని గొర్రిబంద పంచాయతీ జగన్నాథపురం గిరిజన గ్రామంలో జల్ జీవన్ మీషన్ కింద ఇంటింటికీ కుళాయిల కోసం పైపులైన్లు వేశారు. పైపులైన్లు వేసేందుకు యంత్రాలతో రోడ్డును తవ్వారు. రోడ్డుపైనే మట్టి వేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని రోడ్డుపై మట్టి పేరుకుపోవడంతో నడిచేందుకు ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. నీటి సరఫరా అవుతుందో, లేదో తెలియదు గానీ రోడ్డు, మురుగునీటి కాలువలు పూర్తిగా పాడైపోయాయని ఆరోపిస్తున్నారు.

– సారవకోట

నమ్మండి ఇది రైతు సేవా కేంద్రమే!



నరసన్నపేట ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలోని రైతు సేవా కేంద్రం.. కుట్టు మిషన్లను భద్రపర్చేందుకు ఉపయోగపడిందని రైతులు ఆరోపిస్తున్నారు.

రైతులకు సేవలు అందించేందుకు వీలుగా గత ప్రభుత్వం నిర్మించిన రైతు సేవా కేంద్రంలో ఇప్పుడు కుట్టు మిషన్లు భద్రపర్చారు. కూటమి ప్రభుత్వం మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తూ.. వారికి కుట్టు మిషన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీనికి ఆర్ఎస్‌కేను కేటాయించడం పట్ల రైతుల ఆందోళన చెందుతున్నారు. తమకు సలహాలు, సూచనలు మరేలా లభిస్తాయని, ఎరువులు, విత్తనాలు కావాలంటే ఎక్కడకు వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు.

– నరసన్నపేట

మా పాఠశాలను తరలించొద్దు

ఆమదాలవలస: మండలంలోని గాజులకొల్లివలసలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పక్క గ్రామం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉన్న పాఠశాలలో విలీనం చేయవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు. ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మొండేటి కూర్మారావు ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం వినతిపత్రం అందించారు. పాఠశాలను తరలించవద్దంటూ ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల విలీనాన్ని నిలుపుదల చేసి న్యాయం చేయాలని విద్యా కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందన్నారు. ఆ తీర్మానాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 12న ఎంఈఓకు అందించామన్నారు. ఎటువంటి సమావేశం ఏర్పాటు చేయకుండా పాఠశాలను విలీనం చేశారన్నారు.



ఎమ్మెల్యే రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు

పరామర్శ..

కొత్తూరు: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఏరియా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న క్షతగాత్రులను కొత్తూరు మండలం మెట్టూరు బిట్–1 ఆర్ ఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించారు. మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీలోని బత్రిపేటకు చెందిన పలువురు సీతంపేట మండలం కొక్కిరి గ్రామంలో ఉన్న బంధువులను పరామర్శించడానికి శుక్రవారం వెళ్లారు. తిరిగివస్తుండగా సీతంపేట మండలంలోని పూతికవలస వద్ద వారు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. వారిని సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శ్రీనివాసరావు పరామర్శించి, వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు ఉన్నారు.



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న బూర్లె శ్రీనివాసరావు

ఐటీ రిటర్న్స్‌పై అవగాహన

పొందూరు: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆదాయపు పన్ను రిటర్న్స్ ఫైలింగ్‌పై, ట్రెజరీకి సమర్పించాల్సిన బిల్లులపై పొందూరు, జి.సిగడాం మండలాలకు చెందిన డీడీఓలతో ఐటీఓ చంద్రశేఖర్‌ప్రధాన్ ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. డీడీఓలకు శ్రీకాకుళం ఆదాయపు పన్ను అధికారులు అవగాహన కల్పించారు. 24–జి ప్రకారం ప్రతి నెలా 15వ తేదీలోగా ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చే అధికారుల రిటర్న్స్ ఫైలింగ్ చేయడంలో డిఫాల్టర్లు అయిన డీడీఓలకు 16వ తేదీ నుంచి రూ.200 నుంచి రూ. 500 వరకు అపరాధ రుసుం పడుతుందని అప్రమత్తం చేశారు. సీఎఫ్ఎంఎస్ పోర్టల్, నిధి పోర్టల్ లేటెస్ట్ ప్రొవిజన్ మ్యాపింగ్, బిల్స్ సబ్మిట్ చేయడంలో పొరపాట్లను తెలియజేశారు. జీవో 15, 12 ప్రకారం సమర్పించాల్సిన బిల్లులను సూచించిన తేదీల్లోనే సమర్పించాలని ట్రెజరీ అధికారులు సూచించారు. ఈ సమీక్షలో ఆదాయపు పన్ను అధికారులు ఐటీఓ చంద్రశేఖర్ ప్రధాన్, టీపీ ఎర్నిబాబు, ఎస్టీఓ ఎం.తులసీరావు, డీఎల్ఓ శ్రీనివాసరావు, ఎస్ఏ రమణమ్మ, జేఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐటీఓ చంద్రశేఖర్‌ప్రధాన్

కొత్తూరులో పారిశుద్ధ్య పనులు

కొత్తూరు: మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులను సర్పంచ్ పడాల కృష్ణవేణి ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. ఇటీవల వర్షాలు కురవడంతో పలుచోట్ల పారిశుద్ధ్యం లోపించింది. కాలువలు, రోడ్లుపై పేరుకుపోయిన చెత్తను తొలగించి ప్రత్యేక వాహనాలతో డప్పింగ్ యార్డుకు తరలించారు. అన్ని వీధుల్లోని మురుగునీటి కాలువల్లో చెత్తను తొలగిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.